నోటీస్‌బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 1226 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసింది.
అర్హత: కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత. పదో తరగతి కంటే ఎక్కువ విద్యార్హత ఉన్నవారు అనర్హులు. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను పేర్కొనడంతో పాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి.
వయసు: 01-07-2022 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు; దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
ఎంపిక: సీబీటీ/ ఓఎంఆర్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ప్రశ్నపత్రం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ ఓఎంఆర్ పరీక్షలో 45 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్‌లో 30, జనరల్ ఇంగ్లిష్‌లో 15 ప్రశ్నలుంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
దరఖాస్తు రుసుం: ఓసీ/ ఓబీసీలకు రూ.600 (ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.400).
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11-01-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2023.
కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ: మార్చి 2023.
వెబ్‌సైట్: https://tshc.gov.in/getRecruitDetails

ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో 112 సీనియర్ రెసిడెంట్‌లు

రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, క్లినికల్ హెమటాలజీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెంటిస్ట్రీ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడోంటిక్స్, పెడోడాంటిక్స్/ పీడియాట్రిక్స్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మెడికల్ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, నియోనటాలజీ తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ(ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ), ఎండీఎస్, డిప్లొమా ఉత్తీర్ణత.
వయోపరిమితి: 45 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ/ రాత పరీక్ష ఆధారంగా.
దరఖాస్తుకు చివరి తేదీ: 31.01.2023.
వెబ్‌సైట్: https://www.aiimsraipur.edu.in/index.php

వాక్‌ఇన్

కొంకణ్ రైల్వేలో అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఖాళీలు

నవీ ముంబయిలోని కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన కేఆర్‌సీఎల్ ప్రాజెక్టుల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
1. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్: 3 **2. ప్రాజెక్ట్ ఇంజినీర్:** 3 **3. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** 25 **4. జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** 10.
మొత్తం ఖాళీలు: 41
అర్హత: బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్ (సివిల్ ఇంజినీరింగ్)తోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్‌తో
ఇంటర్వ్యూ తేదీలు: 19/01/2023, 20/01/2023, 23/01/2023, 24/01/2023, 30/01/2023.
వేదిక: ఎగ్జిక్యూటివ్ క్లబ్, కొంకణ్ రైల్ విహార్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, సీవుడ్స్ రైల్వే స్టేషన్ దగ్గర, సెక్టార్-40, సీవుడ్స్ (పశ్చిమ), నవీ ముంబయి. **వెబ్‌సైట్:** ttps://konkanrailway.com/

సీఆర్‌పీఎఫ్‌లో 40 స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఒప్పంద ప్రాతిపదికన దేశ వ్యాప్తంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్: 40 పోస్టులు
విభాగాలు: రేడియాలజీ, అనస్థీషియా, ఓఅండ్‌జీ, సర్జన్, ఐ.
అర్హత: సంబంధిత స్పెషాలిటీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ/ డిప్లొమా, పని అనుభవం ఉండాలి. వయసు 70 ఏళ్లకు మించకూడదు.
జీత భత్యాలు: నెలకు రూ.85,000.
ఇంటర్వ్యూ తేదీ: 23-01-2023.
వేదిక: సీఆర్‌పీఎఫ్- కాంపోజిట్ హాస్పిటల్ (జమ్మూ/ ప్రయాగ్‌రాజ్/ రాంపూర్/ దిల్లీ/ అజ్‌మేర్/ నీముచ్/ రాంచీ/ బిలాస్‌పూర్/ జగదల్‌పూర్/ నాగ్‌పుర్/ పుణె/ పిల్లిపురం/ ఆవడి/ హైదరాబాద్/ గువాహటి/ సిల్చార్/ ఇంఫాల్). **వెబ్‌సైట్:** https://crpf.gov.in/

అప్రెంటిస్

సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేలో 4103 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్ వర్క్‌షాప్/ యూనిట్‌ల్లో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు ఐటీఐ ఉత్తీర్ణుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. ఎస్‌సీఆర్ పరిధిలోకి వచ్చే జిల్లాల్లో నివసించే అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
ట్రేడుల వారీగా ఖాళీలు: ఏసీ మెకానిక్-250, కార్పెంటర్-18, డీజిల్ మెకానిక్-531, ఎలక్ట్రీషియన్- 1019, ఎలక్ట్రానిక్ మెకానిక్- 92, ఫిట్టర్-1460, మెషినిస్ట్-71, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్-05, మిల్‌రైట్ మెయింటెనెన్స్-24, పెయింటర్-80, వెల్డర్-553
మొత్తం ఖాళీలు: 4103.
ఎస్‌సీఆర్ యూనిట్లు: క్యారేజ్ వర్క్‌షాప్/ లల్లాగూడ, ఎలక్ట్రిక్ లోకో షెడ్/ లల్లాగూడ, ఎలక్ట్రిక్ మెయింటెనెన్స్/ లల్లాగూడ, మెయింటెనెన్స్ (సికింద్రాబాద్), డీజిల్ లోకో షెడ్/ మౌలాలి, ఎంఈఎంయూ కార్ షెడ్/ మౌలాలి, మెయింటెనెన్స్/ హైదరాబాద్, టీఆర్‌డీ/ హైదరాబాద్, ఎస్‌అండ్‌టీ వర్క్‌షాప్/ సికింద్రాబాద్/ భాజీపేట, డీజిల్ లోకో షెడ్/ భాజీపేట, ఎలక్ట్రిక్ లోకో షెడ్/ భాజీపేట, డీజిల్ లోకో షెడ్/ విజయవాడ, ఎలక్ట్రిక్ లోకో షెడ్/ విజయవాడ, సీఅండ్‌డబ్ల్యూ డిపో/ విజయవాడ, టీఆర్‌డీ/ విజయవాడ, మెయింటెనెన్స్/ విజయవాడ, వ్యాగన్ వర్క్‌షాప్/ గుంటుపల్లి, మెయింటెనెన్స్/ గుంటూరు, ఎంఈఎంయూ కార్ షెడ్/ రాజమండ్రి, డీజిల్ లోకో షెడ్/ గుంతకల్, మెయింటెనెన్స్/ గుంతకల్, సీఅండ్‌డబ్ల్యూ డిపో/ గుంతకల్, డీజిల్ లోకో షెడ్/ గుత్తి, సీఆర్ఎస్/ తిరుపతి, జీఎస్/ తిరుపతి, సీఅండ్‌డబ్ల్యూ డిపో/ తిరుపతి, మెయింటెనెన్స్/ నాందేడ్, సీఅండ్‌డబ్ల్యూ డిపో/ నాందేడ్, సీఅండ్‌డబ్ల్యూ డిపో/ పూర్ణ.
అర్హత: కనీసం 50% మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
వయసు: 30.12.2022 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: పదోతరగతి, ఐటీఐలో సాధించి మార్కుల ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.100 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు మినహాయింపు).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29-01-2023.
వెబ్‌సైట్: scr.indianrailways.gov.in

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512 edc@eenadu.in

ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి రిలయన్స్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. తెలివైన విద్యార్థులను ఉన్నత విద్యావంతులను చేసి, దేశ అభివృద్ధిలో భాగమయ్యేలా తన వంతు సహాయంగా 5100 స్కాలర్‌షిప్పులను ప్రకటించింది. యూజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 5000, పీజీ వాళ్లకు 100 ఉపకార వేతనాలను అందిస్తారు. పరీక్షలో చూపిన ప్రతిభ, అకడమిక్ నేపథ్యం, ఇంటర్వ్యూలతో ఎంపిక చేస్తారు. దరఖాస్తులు ఆహ్వానిస్తున్న నేపథ్యంలో స్కాలర్‌షిప్పుల పూర్తి వివరాలు...

యూజీ, పీజీ విద్యార్థులకు
రిలయన్స్ స్కాలర్‌షిప్పులు

Reliance Foundation

వచ్చే పదేళ్లలో 50,000 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందించాలని రిలయన్స్ ఫౌండేషన్ 2022లో లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా 2022-2023 విద్యా సంవత్సరంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు వీటిని అందించబోతున్నారు. ఎంపికైనవారికి కోర్సు వ్యవధి అంతా ఆర్థిక ప్రోత్సాహం కొనసాగుతుంది.

యూజీ స్థాయిలో..

మెరిట్ కం మీన్స్ ప్రాతిపదికన అందిస్తున్నారు. మొదటి సంవత్సరం ఏదైనా యూజీ కోర్సులు చదువుతున్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.15 లక్షల లోపు ఉన్నవారు అర్హులు. విద్యార్థినులు, దివ్యాంగులకు ప్రాధాన్యం. ఎంపికైనవారు తమ డిగ్రీ వ్యవధిలో సుమారు రూ.2 లక్షల వరకు ప్రోత్సాహం పొందవచ్చు. వీరికి రిలయన్స్ ఫౌండేషన్ నుంచి కెరియర్ పరమైన సహకారమూ లభిస్తుంది.

ఎంపిక

విద్యార్థులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులకు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్టు నిర్వహిస్తారు. ఇందుకోసం ఫీజు చెల్లించనవసరం లేదు. పరీక్ష వ్యవధి ఒక గంట. 60 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. వెర్బల్, ఎనలిటికల్ అండ్ లాజికల్, న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలు ఒక్కో విభాగం నుంచి 20 ఉంటాయి. ప్రతి సెక్షన్‌నూ 20 నిమిషాల్లో పూర్తిచేయాలి. వెర్బల్ ఎబిలిటీలో.. స్పాటింగ్ ఎర్రర్, సెంటెన్స్ కంప్లీషన్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ ప్రశ్నలు వస్తాయి. ఎనలిటిక్ అండ్ లాజికల్ ఎబిలిటీలో.. సమస్యను విశ్లేషించడం, కారణాలు కనుక్కోవడం, పరిష్కారాన్ని గుర్తించడంపై ప్రశ్నలుంటాయి. న్యూమరికల్ ఎబిలిటీలో.. రేషియో, పర్సంటేజీ, నంబర్ సీక్వెన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు వారం ముందు ప్రాక్టీస్ టెస్టు రాసే అవకాశం కల్పిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్టు స్కోరు, అకడమిక్, పర్సనల్ సమాచారం ఆధారంగా అర్హులను ఎంపికచేస్తారు. ఆ వివరాలు మార్చిలో ప్రకటిస్తారు. నగదు ప్రోత్సాహంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, వర్క్‌షాపులు, పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌తో అనుసంధానం మొదలైనవి ఉంటాయి.

అర్హత

ఇంటర్/ప్లస్ 2లో 60 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం ఏదైనా యూజీ రెగ్యులర్ కోర్సు ప్రథమ సంవత్సరం చదువుతుండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.15 లక్ష లకు మించరాదు. రూ.2.5 లక్షల లోపు ఉన్న వారికి ప్రాధాన్యం.

దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 14
వెబ్‌సైట్:
www. scholarships.reliancefoundation.org/

పీజీ స్థాయిలో..

దేశంలో ఏదైనా సంస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కెమికల్, రెన్యూవబుల్ అండ్ న్యూ ఎనర్జీ, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్ కోర్సులు చదువుతున్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధికి మొత్తం రూ.6 లక్షల వరకు అందిస్తారు. ఇందులో 80 శాతం విద్యా సంవత్సరం ప్రారంభంలో, మిగతా 20 శాతం ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్, కాన్ఫరెన్సులు, పర్సనల్ డెవలప్‌మెంట్... తదితర ఖర్చుల కోసం చెల్లిస్తారు. నిపుణులతో సమావేశం, సంబంధిత రంగంపై అవగాహన పెంచడం ఈ స్కాలర్‌షిప్పులో భాగం.

ఎంపిక

రిలయన్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో ఎలిజిబిలిటీ క్వశ్చనీర్‌ను పూర్తిచేయాలి. పర్సనల్, అకడమిక్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వివరాలు నమోదు చేసుకోవాలి. రెండు రిఫరెన్స్ లెటర్లు జతచేయాలి. వీటిలో ఒకటి అకడమిక్ నైపుణ్యాలు, రెండోది వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు తెలిపేది కావాలి. రెండు ఎస్సేలు ఒకటి పర్సనల్ స్టేట్‌మెంట్, రెండోది స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ రాసివ్వాలి. ఇండస్ట్రీ నిపుణులు, అకడమిషియన్లు, సంబంధిత విభాగంలో నాయకత్వ స్థాయిలో ఉన్నవారు బృందంగా ఏర్పడి దరఖాస్తులు పరిశీలిస్తారు. ఇలా పరిశీలనలో నిలిచినవారికి ఇంటర్వ్యూ ప్రిపరేషన్, వెబినార్లు ఉంటాయి. నిపుణుల బృందం వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది. ఇందులో మేటి పంద మందికి స్కాలర్‌షిప్పులు మంజూరు చేస్తారు.

అర్హత

పీజీ తొలి సంవత్సరం కోర్సు చదువుతుండాలి. గేట్‌లో 550-1000 మధ్య స్కోర్, లేదా యూజీలో 7.5 సీజీపీఏ అవసరం.

ఏ కోర్సులు చేస్తే మేలు?

ఈ ఏడాది ఎంకాం పూర్తిచేశాను. ప్రైవేటు బ్యాంకులోగానీ సాఫ్ట్‌వేర్ రంగంలోగానీ ఉద్యోగం చేయాలనుంది. ఇందుకు ఉపయోగపడే కోర్సులు ఏవి? - దినేష్

■ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగానికి మీ ఎంకాం విద్యార్హత సరిపోతుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేయాలంటే మాత్రం కొన్ని ప్రత్యేకమైన కోర్సులు నేర్చుకోవాలి. సాధారణంగా ఎంకాం చదివినవారికి ప్రైవేటు బ్యాంకుల్లో అకౌంటెంట్, అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ హోదాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. జీతంతో సంబంధం లేకుండా ఏదో ఒక ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం మొదలుపెట్టండి. కొంత అనుభవం పొందాక పెద్ద బ్యాంకుల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చు. బ్యాంకులో ఉద్యోగం చేస్తూనే ఫైనాన్షియల్ ప్లానింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లాంటి కోర్సులు చేసి మీ ఉద్యోగావకాశాలను మెరుగుపర్చుకోండి.

ఎంకాం చదివినవారికి ప్రైవేటు బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ కొలువులకు ప్రత్యేక శిక్షణ అవసరం లేదు.

ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల విషయానికొస్తే బిజినెస్ ఎనలిటిక్స్, ఈఆర్‌పీ, ఎస్ఏపీ, ఒరాకిల్ ఫైనాన్సియల్స్ లాంటి కోర్సుల్లో సరైన సంస్థ నుంచి శిక్షణ పొంది ఉద్యోగ ప్రయత్నాలు చేయండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు — హైదరాబాద్‌లో

లాజిస్టిక్స్
సంస్థ: క్యారీప్రెష్ లాజిస్టిక్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000-7,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యం
☛ internshala.com/i/f00d18

అకౌంట్స్
సంస్థ: యూత్ ఫర్ యాక్షన్
స్టైపెండ్: నెలకు రూ.12,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: అకౌంటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ట్యాలీ నైపుణ్యాలు
☛ internshala.com/i/f08a50

ఆన్‌లైన్ కోర్సులు చేస్తుంటే..

ఇన్నాళ్లూ పుస్తకాలు నేరుగా చదవడం అలవాటైన విద్యార్థులకు ఈ ఆన్‌లైన్ క్లాసులు కొత్త. నేర్చుకునే విధానంలో దానికీ దీనికీ కొంత వ్యత్యాసం ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోనూ ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో... భవిష్యత్తులో మరింతగా ఈ ఆన్‌లైన్ లెర్నింగ్ పెరుగుతుందని అంచనా... ముఖ్యంగా ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణలో! ఇది విద్యార్థులకు ఒక సంధి దశ. ఈ నేపథ్యంలో ఎటువంటి విధానాలు పాటిస్తే దీని ద్వారా వంద శాతం ఫలితాలు అందుకోవచ్చు... ఏవిధంగా ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవచ్చనే అంశాలను ఒకసారి పరిశీలిస్తే.

ఆన్‌లైన్ లెర్నింగ్... గత రెండేళ్లలో విద్యారంగంలో వచ్చిన అతిపెద్ద మార్పు. గతంలో అడపాదడపా, అదీ ఉన్నత విద్యను అభ్యసించేవారు మాత్రమే ఆన్‌లైన్ తరగతులకు హాజరవ్వడం, కోర్సులు చేయడం వంటివి చేసేవారు.

కానీ కరోనా పుణ్యమాని ప్రాథమిక విద్య నుంచే పాఠాలు ఆన్‌లైన్‌లో చదువుకోవడం ప్రారంభమైంది. దీని ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలి అనుకునేవారికి మరిన్ని కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. దేశవిదేశాలకు సంబంధించి సంస్థల డిగ్రీలు చేసేందుకూ, కంటెంట్‌ను వినియోగించుకునేందుకూ అవకాశం దొరికింది. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపు...

«చదువు ఎలా చదివినా ఏకాగ్రత, సమయం కేటాయించడం, పునశ్చరణ, నమూనా పరీక్షలు ముఖ్యం. అయితే ఆన్‌లైన్‌గా చదివేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా మరింత సులభంగా, వేగంగా అనుకున్న లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుంది అంటున్నారు నిపుణులు.

మామూలు తరగతిలాగానే...

ముఖ్యంగా ఆన్‌లైన్ పాఠాలు, తరగతులను పూర్తిస్థాయిలో మామూలు తరగతి మాదిరిగానే పరిగణించాలి. అందరితో క్లాసులో ఉన్నప్పుడు ఎంత శ్రద్ధగా ఉంటామో... ఇక్కడా అలాగే ఉండేందుకు ప్రయత్నించాలి. నలుగురితో ఉన్నప్పుడు అనిపించిన విధంగా ఒంటరిగా పాఠం వినడం అనిపించకపోవచ్చు. త్వరగా బోర్ కొట్టే అవకాశం కూడా ఉంటుంది. పైగా నేరుగా విన్నదానికీ తెరనుంచి విన్నదానికీ ఉండే తేడా ఉండనే ఉంది. అయితే.. వీటన్నింటినీ దాటుకుని వీలైనంత త్వరగా ఈ పద్ధతిని అలవరుచుకోవడం, చదవడాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా కోర్సుపై అధిక శ్రద్ధ చూపగలుగుతాం. దీని కోసం కడుతున్న ఫీజు, కేటాయిస్తున్న సమయం, ఇది మనకు ఎంత ముఖ్యమైన డిగ్రీ... ఇవన్నీ ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ ఉంటే కొంతవరకైనా బోర్, కొత్త అనే భావన నుంచి బయటకు రాగలుగుతాం.

సమయం.. సద్వినియోగం

ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యేటప్పుడు ఉండే అతిపెద్ద సౌలభ్యం ఏమిటంటే.. మన టైమ్ మన చేతుల్లో ఉంటుంది. అనుకూల సమయంలో పాఠాలు చదివే వీలున్నప్పుడు.. మొదటి నుంచి పక్కా ప్రణాళికతో చదువుకునేందుకు ప్రయత్నించడం ఉపకరిస్తుంది. తరగతులు మొదలైనప్పటి నుంచే ఏం చదవాలి, ఎలా చదవాలి అనేది లెక్క ప్రకారం నిర్ణయించుకుని పాటిస్తే... సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్న వాళ్లమవుతాం. తరగతులకు హాజరు కావడం, అసైన్‌మెంట్లు పూర్తిచేయడం, పునశ్చరణ, పరీక్షల సన్నద్ధత, ఇతర పనులకు తగిన విధంగా సమయాన్ని కేటాయించుకోవాలి.

ఒకేచోట స్థిరంగా...

ల్యాప్‌టాపే కదా అని ఇంట్లో ఎక్కడ అంటే అక్కడ కూర్చుని చదవడానికి ప్రయత్నిస్తే ఏకాగ్రత కుదరడం కష్టమైపోతుంది. గమనిస్తే.. చాలామందికి కొత్త చోటుకు వెళ్తే నిద్రపట్టదు. ఎందుకంటే మనకు అలవాటైన ప్రదేశంలో నిద్రపోవడానికి మన మెదడు ట్యూన్ అయ్యి ఉంటుంది.. హఠాత్తుగా మార్పు వస్తే ఒకపట్టాన నిద్రపోలేక ఇబ్బందిపడతాం. చదువు విషయంలోనూ అంతే. నిశ్శబ్దంగా, చక్కని గాలి వెలుతురు ఉండే చోట స్థిరంగా కూర్చుని చదువుకోవడం అలవాటు చేసుకోవాలి. ఆ ప్రదేశాన్ని స్టడీ కోసం మాత్రమే వినియోగించాలి. అప్పుడు నెమ్మదిగా మనకు అక్కడ కూర్చోగానే చదవాలి అనే ఆలోచన, ఏకాగ్రత వచ్చేలా అలవాటుపడతాం. అలాగే మధ్యలో ఎటువంటి అంతరాయం కలగకుండా హైస్పీడ్ ఇంటర్నెట్, కావాల్సిన సాఫ్ట్‌వేర్లు, హెడ్ ఫోన్స్, ఇతర వస్తువులు అన్నీ ముందే అమర్చి పెట్టుకోవాలి.

నోట్స్... రికార్డ్

తరగతి జరుగుతున్నప్పుడు నోట్స్ రాసుకోవడం తప్పక చేయాల్సిన సాధన. అప్పుడే వినే అంశాలపై స్పష్టత ఉంటుంది, తర్వాత రివిజన్ చేసేటప్పుడు సులభంగానూ ఉంటుంది. అవసరం అనుకుంటే తరగతులను రికార్డ్ చేసుకుని సేవ్ చేసుకోవడం మంచిది. సందేహాలు ఉన్నా... మళ్లీ చూడాలి అనుకున్నా.. ఇవి బాగా ఉపయోగపడతాయి. ఎగ్జామ్ ప్రిపరేషన్ సమయంలోనూ పనికొస్తాయి.

సందేహాల నివృత్తి..

ఆన్‌లైన్ క్లాసులు జరిగేటప్పుడు సందేహాలు నివృత్తి చేసుకోవడం కొంచెం కష్టమైన పనే. అధ్యాపకులు నేరుగా ఉండకపోవడం వల్ల మన సందేహాలను ముఖాముఖి మాట్లాడే సందర్భంలోనూ, ఈ-మెయిల్ రూపంలోనూ అడగాలి... ఒక్కో చోట ఒక్కో పద్ధతి ఉంటుంది. ప్రతిసారీ ఇలా చేయడం కొంచెం కష్టం కాబట్టి.. క్లాసుకు ముందే పాఠం మీద కొంత అవగాహన పొందడం, సొంతంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం మేలు. అప్పటికీ తెలియకపోతే సహాయం చేసేందుకు అధ్యాపకులు ఎటూ ఉన్నారు. కానీ ముందే మనం తెలుసుకోవడం వల్ల అవగాహన పెరగడమే కాదు, సమయమూ ఆదా అవుతుంది.

«క్లాసులకు హాజరుకాకపోవడం, అసైన్‌మెంట్లు వాయిదా వేయడం వంటివి అస్సలు చేయకూడదు. దానివల్ల మనం ఇతరుల కంటే వెనుకబడి క్రమపద్ధతిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

ప్రేరణ కోల్పోకుండా...

కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చుని, అవతలివారు చెప్పేది వినేందుకు ప్రయత్నించడానికి మోటివేషన్ కావాలి. విసుగ్గా అనిపించినప్పుడు, అలసటగా అనిపించినప్పుడు... ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా రిఫ్రెష్ మైండ్‌తో వెనక్కి వచ్చేలా చూడాలి. దీనికి చిన్నపాటి నడక, ఒక మంచి కాఫీ వంటివి ఉపకరిస్తాయి. ఏదేమైనా నేర్చుకోవడానికి నిరంతరం ప్రేరేపితమై ఉండాలి. ఏకాగ్రత చూపడమే అధిక ప్రాధాన్యంగా మారాలి. వేరే విషయాలపైకి ధ్యాస మళ్లకుండా జాగ్రత్తపడాలి.

నేర్చుకునే పద్ధతి...

కొంతమంది విజువల్ లెర్నర్స్ ఉంటారు... వీరికి ఏదైనా కళ్లతో చూస్తే ఎక్కువకాలం గుర్తుంటుంది. మరికొందరు లిజనర్స్ ఉంటారు. వీరికి పాఠాలు పదే పదే వినడం వల్ల ఎక్కువగా గుర్తుంటుంది. మనకు ఏది ఎక్కువ ప్రభావవంతంగా పనిచేస్తుందో గుర్తించాల్సింది మనమే. అలాగే రోజులో ఏ సమయంలో చదివితే ఎక్కువ ఏకాగ్రత చూపగలుగుతున్నాం అనేది కూడా చెక్ చేసుకుని ఆ టైంలో చదవడానికి కూర్చోవడం మంచిది.